సాక్షి ములుగు

గురువారం । 16 । మే । 2024



ఆన్‌లైన్ జాబ్ పేరుతో మోసం

ఆన్‌లైన్ జాబ్ పేరుతో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి సుమారు రూ.12 లక్షలు పోగొట్టుకున్నాడు.

- 8లో▸



ఆయుర్వేద ఆస్పత్రిలో 'టెలి మెడిసిన్'

వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో టెలి మెడిసిన్ సేవలు ప్రారంభమయ్యాయి.

- 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. రాత్రివేళ కాస్త ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యాలయం ప్రారంభం



ములుగు రూరల్: జిల్లాకేంద్రంలోని గిరిజన భవన్ సమీపంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ(జాతీయ మానవ హక్కుల కమిటీ, స్వచ్ఛంధ సంస్థ) నూతన జిల్లా కార్యాలయాన్ని ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా లీగల్ ప్రొసిజర్, తదితర సమస్యల పరిష్కారానికి కమిటీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గోగుల మూడి హరికృష్ణ, ఏడుకొండలు, సంజీవ, వేణురెడ్డి, కృష్ణయాదవ్, శ్రీనివాసచారి, రాజేందర్, రవి, మధుకర్, శ్రీను పాల్గొన్నారు.

వైద్య కళాశాల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



ములుగు: ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.మోహన్‌లాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి అనుమతితో 32 పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఖాళీల వివరాలు.. డీ సెక్షన్ హాల్ అటెండెంట్ 4, డాటా ఎంట్రీ ఆపరేటర్లు 10, ఆఫీస్ సబార్డినేట్ 8, థియేటర్ అసిస్టెంట్ 4, ల్యాబ్ అటెండెంట్ 4, రికార్డు అసిస్టెంట్ 2 ఉన్నాయని వివరించారు. దరఖాస్తు ఫాంలను వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ://ములుగు తెలంగాణడాట్‌జీఓవీడాట్ ఇన్/ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని రేపటి నుంచి 22వ తేదీ సాయంత్రం 5గంటల వరకు వయస్సు, విద్యార్హత, ఇతర వివరాలను పొందుపరచి వైద్య కళాశాలలోని రూం నంబర్ -48(ఫస్ట్ ఫ్లోర్), ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అందించాలని సూచించారు. వివరాలకు హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్ 7013952246కి ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించాలని తెలిపారు.

కేయూ అడ్మిషన్ల జాయింట్ డైరెక్టర్‌గా భిక్షపతి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అడ్మిషన్ల జాయింట్ డైరెక్టర్‌గా హిస్టరీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భిక్షపతిని నియమిస్తూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అలాగే స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నిరంజన్ శ్రీనివాస్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులిచ్చారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు షురూ



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షలను నిర్వహణ తీరును కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి పరిశీలించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్ పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే ఆస్పత్రి తనిఖీ

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఆస్పత్రిని సికింద్రాబాద్ రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణస్వామి బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను కలియ తిరిగి పరిశీలించారు. స్థానిక రైల్వే సీనియర్ డీఎంఓ డాక్టర్ నిరంజన్‌రావు, ఇతర డాక్టర్లతో మాట్లాడారు. అంతకు ముందు రైల్వే డాక్టర్లు, రైల్వే నాయకులకు సీఎంఎస్ నారాయణస్వామికి స్వాగతం పలికి సన్మానించారు. రైల్వే జేఏసీ, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఆస్పత్రి సమస్యలపై సీఎంఎస్‌కు వినతిపత్రం అందజేశారు.

కొనుగోళ్లు కొంతే!

లక్ష్యం చేరని ధాన్యం సేకరణ

- నేరుగా మిల్లర్లకు విక్రయిస్తున్న రైతులు
- ఖర్చులు లేకపోవడం, ఎక్కువ ధర చెల్లింపుతో అన్నదాతల మొగ్గు
- జిల్లాలో 9 మండలాలు.. 144 కేంద్రాలు ఏర్పాటు



ములుగు రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ అంతంతే జరుగుతోంది. జిల్లాలోని 9 మండలాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు 144 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎప్పటిలాగే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ ధాన్యం సేకరణ లక్ష్యం మాత్రం ముందుకు సాగడం లేదు. మద్దతు ధరకు మించి కొనుగోలు చేస్తుండడంతో రైతులు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది.

సీఎంఆర్ భర్తీ కోసమేనా..

జిల్లాలో రైస్ మిల్లర్లకు అప్పగించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రభుత్వానికి ఇవ్వకుండా తమకు కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ ధాన్యం భర్తీ చేసేందుకు రైస్ మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

తేమశాతంతో పని లేదు..

వరి కోతలు మొదలు కాగానే మిల్లర్లు రైతులను నేరుగా కలిసి ప్రభుత్వం మద్దతు ధరకు రూ.100 తక్కువతో తేమశాతంతో పని లేకుండా కొనుగోలు చేస్తున్నారు. రైతులు మిషన్ల ద్వారా వరికోతలు కోసి ట్రాక్టర్ల ద్వారా ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారు. ఏ-గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,208 ఉండగా మిల్లర్లు 2,100 నుంచి పైకి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు పూర్తిగా పనిభారం తగ్గుతుంది. ధాన్యం ఆరబోయడం, హమాలీ చార్జీలు, బస్తాలు నింపడం, మిల్లులకు తరలించడం వంటి ఖర్చులు పూర్తిగా తగ్గిపోవడంతో రైతులకు పని భారంతోపాటు ఖర్చులు సైతం కలిసి వస్తున్నాయి.



కాంటాలు ఆలస్యం

యాసంగి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు రైతులు ధాన్యం తరలించి రోజులు గడుస్తున్నా పలుచోట్ల కాంటాలు కావడం లేదు. దీంతో రోజుల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వేచి చూస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తేమశాతం ఎక్కువగా వస్తుంది. దీంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేమశాతం వస్తేనే కాంటాలు నిర్వహిస్తామని చెప్పడంతో చేసేది ఏమిలేక రైతులు వేచి చూస్తున్నారు.

ధాన్యం సేకరణ వివరాలు

మొత్తం కొనుగోలు కేంద్రాలు	144
సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో)	88,528
సేకరించిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో)	11,934
విక్రయించిన రైతులు	1,674
కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో)	38,020
సొమ్ము ఖాతాల్లో జమ అయిన రైతులు	624
ధాన్యం విలువ	రూ.26.29 కోట్లు

ధాన్యం తక్కువగా వస్తోంది..



జిల్లాలోని 9 మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలకు రైతులు తక్కువ మొత్తంలో ధాన్యం తీసుకు వస్తున్నారు. సన్న రకం ధాన్యం మద్దతు ధరలకు వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేయడంతో బీ-గ్రేడ్ ధాన్యం కేంద్రాలకు వస్తోంది. కాంటాలు పూర్తయిన వెంటనే వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీ చేపట్టి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. ఈ సారి అంచనాలు చేరుకోవడం కష్టంగా ఉంది.

- రాంపతి, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్

కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలి

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్రకళ



మాట్లాడుతున్న జడ్జి సూర్యచంద్రకళ

ములుగు: వచ్చే నెల 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎస్‌వీపీ సూర్యచంద్రకళ అన్నారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కక్షిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా రాజీమార్గం ద్వారా కేసు పరిష్కరించుకునేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. న్యాయ సలహాలు, సూచనల కోసమైనా న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించి తగిన సహాయం పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రాములు, పరకాల సబ్‌జైల్ సూపరింటెండెంట్ ప్రభాకర్, ఎక్సైజ్ సీఐలు సుధీర్ కుమార్, బండారి కుమార్, ఎస్సైలు అశోక్, షేక్‌మస్తాన్, డీడబ్ల్యూఓ స్వర్ణలత, డీసీపీఓ ఓంకార్, సీడీపీఓ స్వామి, వరంగల్ డీపీఓ రాధ, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ములుగు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండి అమ్జద్‌పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని మధనపల్లి, జగ్గన్నపేట, జంగాలపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి పది రోజులు గడిచినా నిర్వాహకులు కాంటాలు పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓకు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల రాజు, నారాయణసింగ్, రమేష్, శ్రీనివాస్, వెంకటయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం



మాట్లాడుతున్న బలరాం

ములుగు రూరల్: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు కష్టపడిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ ఎన్నికల మాదిరిగానే రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త, నాయకుడు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, ఏనుగు రవీందర్‌రెడ్డి, కృష్ణాకర్, నాగరాజు, మల్లేష్, వెంకన్న, సునీల్, రాజ్‌కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై లారీలు పార్కింగ్ చేస్తే చర్యలు



లారీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్పీ

ఏఎస్పీ మహేష్ గీతే బాబాసాహెబ్

ఏటూరునాగారం: ఇసుక లారీలను ఎక్కడైన రోడ్లపై పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ మహేష్ గీతే బాబాసాహెబ్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఇసుక లారీల డ్రైవర్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోని లారీల డ్రైవర్లు ఎక్కడైనా రోడ్ల పక్కన, రోడ్లపై లారీలను, ఇతర వాహనాలను నిలపరాదని తెలిపారు. ఏదైనా వాహనం చెడిపోతే దానికి పార్కింగ్ లైట్స్, వాహనదారులు గుర్తు పట్టే విధంగా గుర్తులు, మార్కింగ్ చేసి ఉంచాలన్నారు. లారీల డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడిపితే లైసెన్సులను రద్దు చేసి వాహనం సీజ్ చేస్తామన్నారు. ఇసుక లారీల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. లారీల డ్రైవర్లు తమవంతు బాధ్యతగా పోలీసులు ఇచ్చిన సూచనలను పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, లారీల డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ పరిశీలన



ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

కన్నాయిగూడెం: మండల పరిధిలోని ఏటూరు వద్ద రైతుల పట్టా భూముల్లో గోదావరిలో ఉన్న ఇసుక క్వారీని రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. గోదావరిలోని పట్టా భూముల్లో ఇసుకను తియ్యడానికి తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు తవ్వకాలు జరిపే భూములు తమవని రెవెన్యూ అధికారులకు తెలుపడంతో రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ గణేశ్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం తవ్వకాలు జరిపిన ప్రదేశంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని తేల్చి చెప్పారు. అనుమతులు లేకుండా గోదావరిలో జేసీబీలతో తవ్వకాలు జరపడంతో పాటు, రోడ్డు పనులు కూడా చేపట్టినట్లు గుర్తించారు. అనుమతి పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందించిన తర్వాతే పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించినట్లు గణేశ్ తెలిపారు.

న్యాక్ ఏ-గ్రేడ్ సాధనలో క్రియాశీలక పాత్ర

- కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్



వీసీని సన్మానిస్తున్న అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ న్యాక్ ఏ-గ్రేడ్ సాధించడంలో బల్డింగ్ డివిజన్ క్రియాశీలక పాత్ర వహించిందని వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. ఆయన పదవీ కాలం ఈనెల 21న ముగియనున్న నేపథ్యంలో క్యాంపస్‌లోని బిల్డింగ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం వీసీని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ వర్సిటీలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి, ఇంజనీర్‌లు రామయ్య, భవానీ ప్రసాద్, ఫైనాన్స్ ఆఫీసర్ తొట రాజయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాము, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఫీజు చెల్లింపునకు చివరి అవకాశం

భూపాలపల్లి అర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు(గురువారం) చివరి అవకాశమని జిల్లా ఇంటర్ విద్యానోడల్ అధికారి దేవరాజం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.1000 అపరాధ రుసుముతో ఈ రోజు సాయంత్రంలోగా చెల్లించాలని సూచించారు.

మేమే గెలుస్తాం

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై ఎవరి ధీమా వారిది

- పక్కా గెలుస్తామంటున్న కాంగ్రెస్ నేతలు
- మాదే విజయం అంటున్న బీఆర్‌ఎస్ నాయకులు
- లోలోపల ఆందోళన.. పైకి గాంభీర్యం ప్రదర్శన



సాక్షి, మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో.. ప్రస్తుతం ఫలితాలపై నాయకులు అంచనాలు వేస్తున్నారు. మేమే గెలుస్తామంటే.. మేమే గెలుస్తాం అంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులతో పాటు, ప్రజాప్రతినిధులు, నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి వారుగా ప్రకటనలు చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నారు. ఇదిలా ఉండగా అభ్యర్థులు, నాయకులు మాత్రం పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. లోలోపల మాత్రం ఒకింత ఆందోళన చెందుతున్నారు.

గెలుపు మాదే అంటున్న కాంగ్రెస్

మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో పాటు ఆయా పార్టీలకు చెందిన నాయకులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందురోజు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తుమ్మ ల నాగేశ్వరరావు విలేకరుల సమావేశంలో గెలుపు లాంఛనమే అని, మెజార్టీ కోసమే ప్రయత్నాలు చేస్తున్నామని ప్రకటించారు. ఎన్నికల తర్వాత అభ్యర్థి బలరాంనాయక్, ఎమ్మెల్యేలు రాంచంద్రు నాయక్, మురళీనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి విలేకరుల సమావేశం లో భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు రాకముందే.. గెలిచేది నేనే అంటూ బలరాంనాయక్ చెప్పారు. ఇందుకు సహకరించిన ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలా కాంగ్రెస్‌లోని ఏ నాయకుడిని పలరించినా... బలరాంనాయక్ విజయం తథ్యమంటూ చెబుతున్నారు.

బీఆర్‌ఎస్ ధీమా

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సర్వశక్తులు ఒడ్డింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర ఉద్యమకాలం నాటి నాయకుడిని తలపించింది. మానుకోటలో కేసీఆర్ బస్సు యాత్ర విజయవంతం నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామనే నమ్మకం పెరిగింది. అదే స్థాయిలో నాయకులు చమటోడ్చారు. ఎన్నికల తర్వాత అభ్యర్థి మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రజలు కారు గుర్తుపై ఓట్లు వేశారు. పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగురవేయడం ఖాయం అని ప్రకటించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ కూడా విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ గెలుపు పక్కా అని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ కూడా గెలుపుపై ధీమాతో ఉన్నట్లు అనుచరులు చెబుతున్నారు. ఇలా ఎవరికి వారుగా రెండు పార్టీల నాయకులు గెలుపు మాదే అనే ధైర్యంతో ఉన్నట్లు కనిపిస్తోంది.

పైకి గాంభీర్యం.. లోపల ఆందోళన

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ధీమా వ్యక్తం చేస్తూ పైకి గాంభీర్యంగా కనిపిస్తున్నా.. లోపల మాత్రం ఆందోళనతోనే ఉన్నట్లు స్పష్టం అవుతుంది. నిన్నటి వరకు భారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలు ఐదు నెలల వ్యవధిలోనే మారారు అనేది ఎంత వరకు నిజం అనేది బీఆర్‌ఎస్ నాయకులు అంచనా వేయలేకపోతున్నారు. అయితే తమ తమ ప్రాంతాల్లో ఎంత వరకు మెజార్టీ వస్తుందనే అంచనాలు కూడా వేస్తున్నారు. అదేవిధంగా ఎన్నికలకు పదిరోజుల ముందు వరకు కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు కలిసి రావడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. అయితే టీపీసీసీ నుంచి ఆదేశాలు రావడంతో రంగంలోకి దిగిన ఎమ్మెల్యేలు, నాయకులు తమ ప్రాంతాల్లో మెజార్టీ చూపించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అయితే తమ ఎన్నికల అంత కష్టపడలేదనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మెజార్టీ ప్రమాణికం కానుంది. మెజార్టీ వస్తుందా.. లేదా.. వస్తే ఎంత వస్తుంది.. రాకపోతే హైకమాండ్‌కు ఏం సమాధానం చెప్పుకోవాలి.. అనే మీమాంసలో పడ్డారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు






వీసీలో పాల్గొన్న కలెక్టర్లు

కాశోజీ సెంటర్: వరంగల్-ఖమ్మం-నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల అదనపు సీఈఓ లోకేష్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉప ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు, నిర్వహణపై ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు జిల్లాలో 59 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 65 జంబో బాక్సులు, 48 పెద్ద బాక్సులు రెడీగా ఉన్నాయని తెలిపారు.

అమ్మవారికి గంధోత్సవం



గంధంతో అలంకరించిన స్నపనమూర్తి

హన్మకొండ కల్చరల్: భద్రకాళీభద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా వరంగల్‌లోని శ్రీభద్రకాళి దేవాలయంలో బుధవారం ఉదయం నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తిని గజపూమాలలతో అలంకరించిన అనంతరం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యాన వేదపండితులు అమ్మవారి స్నపనమూర్తికి గంధం పట్టించి ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని సామ్రాజ్యలక్ష్మిగా అలంకరించి సాలభంజికవాహనంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. పూజా కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర, ఉమ్మడి జిల్లా కుమ్మరి సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవునూరి రాంమూర్తి ప్రజాపతి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రుద్రారపు కుమారస్వామిప్రజాపతి, కదారి ఓంప్రకాష్, తొటి దేవేందర్, వద్లూరి విష్ణు, ఆకారపు రాజగోపాల్, ఉర్సు కుల సంఘం నాయకులు నాగరాజు, శ్రీనివాస్. సత్యం, కందికొండ కుమారస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూలీలపై తేనె టీగల దాడి..

● ఆరుగురికి గాయాలు

చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్ బండగుట్టపై పని చేస్తున్న ఉపాధి కూలీలపై తేనె టీగలు దాడి చేయడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. రోజు మాదిరిగానే బుధవారం బండగుట్టపై సీసీటీ(కాంటూరి కందకాలు) పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ చెట్టు పొదల్లో ఉన్న తేనె టీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఇందులో గుగులోత్ బాలు, అరుణ, పీనా, భీమా, తిమ్మాపురం తరుణ్‌కుమార్, రాజమణి గాయపడ్డారు. అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, ఎఫ్ఏ భూక్య నరసింహులు.. క్షతగాత్రులకు పనిప్రదేశంలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించారు. కాగా, ఏపీఓ మోహన్‌రావు ఎంజీఎం వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

'కుక్క'తిప్పలు..



కుక్క తలకు ఇరుక్కున్న ప్లాస్టిక్ డబ్బా

గార్ల: గార్ల రైల్వేస్టేషన్ సమీపంలో కుక్క తల ప్లాస్టిక్ డబ్బాలో ఇరుక్కుపోవడంతో ఊపిరి ఆడక తీవ్ర ఇబ్బందులు పడింది. గమనించిన ఆటోడ్రైవర్లు, హమాలీ కార్మికులు 2 గంటల పాటు శ్రమించి కుక్కతలకు ఇరుక్కుపోయిన ప్లాస్టిక్ డబ్బాను తొలగించారు. దీంతో కుక్క ప్రాణాపాయం నుంచి బయటపడింది.

వడదెబ్బతో భవన నిర్మాణ కార్మికుడి మృతి



కమలాకర్ (ఫైల్)

గీసుకొండ : వడదెబ్బతో గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు చిలువేరు కమలాకర్ (35) బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కమలాకర్ రెండు రోజుల నుంచి ఎండలో పని చేయడంతో వడదెబ్బ తగిలి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడు..



వెంకన్న (ఫైల్)

ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో కల్లు గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి బుధరావుపేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రావుల వెంకన్న (45) రోజువారిగానే తాటి చెట్టు ఎక్కడానికి సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మహబూబాబాద్ నుంచి నర్సంపేట వెళ్తున్న కారు.. వెంకన్నను ఢీకొనగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రఘుపతి ఘటనా స్థలికి చేరుకుని కారులో ప్రయాణిస్తున్న ఇరువురి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా, మృతుడికి భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

ఆయుర్వేద ఆస్పత్రిలో 'టెలి మెడిసిన్'

కాశిబుగ్గ : ప్రభుత్వ వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. సాంకేతికతకు తోడుగా నవీకరణ వైపు అడుగులు వేస్తున్నది. ఇందుకు నిదర్శనమే 'టెలి మెడిసిన్'. కరోనా విపత్కర పరిస్థితుల్లో అందుబాటులోకి వచ్చిన ఈ విధానం సేవలు ఇప్పుడు ఆయుర్వేద ఆస్పత్రుల్లో అందుబాటులోకి వచ్చాయి. వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో టెలి మెడిసిన్ సేవలు ప్రారంభమయ్యాయి.

తెలంగాణలో రెండో అతిపెద్ద ఆయుర్వేద ఆస్పత్రి..
వరంగల్ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో ఉంది. ఇందులో ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులతోపాటు మొండి రోగాలకు ఇక్కడ వైద్యం చేస్తున్నారు. అల్లోపతి వైద్యానికి తగ్గని రోగాలకు ఇక్కడి వైద్యులు చికిత్సతో నయం చేస్తున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి రోగులు వచ్చి వైద్యం పొందుతున్నారు. దూరభారం కావడంతో పలువురు ఆయుర్వేద చికిత్స చేయించుకోకుండా అల్లోపతితోనే సరిపుచ్చుకుంటున్నారు. ఇలాంటి వారికి టెలి మెడిసిన్ సేవలు ఎంతో ఉపకరించే అవకాశాలున్నాయి. దూర ప్రాంతాలకు చెందిన రోగులు వరంగల్ ఆస్పత్రికి రాకుండానే ఇంటి నుంచి ఆయుర్వేద వైద్య సేవలు పొందొచ్చు.

ఉదయం 10 నుంచి 12 గంటల వరకు..
ఆస్పత్రిలో ప్రస్తుతానికి టెలి మెడిసిన్ సేవలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. శల్య, శాలక్య, బాలరోగ, ప్రసూతి, స్త్రీ రోగ, స్వస్థవృత్త, పంచకర్మ, కాయచికిత్స తదితర విభాగాలకు చెందిన నిపుణులలో రోజూ ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ టెలి మెడిసిన్ పద్ధతిలో రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. రోగి ఫోన్ చేస్తే ఆ రోజు డ్యూటీలో ఉన్న వైద్యుడు రిసీవ్ చేసుకుని వైద్యం చేస్తుంటారు. దగ్గరి వారైతే తరువాత రోజు ఆస్పత్రికి వచ్చి మందులు తీసుకోవచ్చు. లేదా దగ్గరలోని డిస్పెన్సరీల్లోనూ తీసుకోవచ్చు లేదా ప్రైవేట్ షాపులలో కూడా లభిస్తాయి. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఆడియో కాల్స్‌తో చికిత్స అందిస్తామని, త్వరలో వీడియో కాలింగ్ ద్వారా కూడా అందుబాటులోకి తీసుకువస్తాయని అధికారులు తెలిపారు. ఈసేవలకు ఆదరణ లభిస్తే ఉదయం 9 నుంచి 4 సాయంత్రం గంటల వరకు సేవలు అందించే అవకాశం ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు.



వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల



టెలిమెడిసిన్‌లో వైద్యం అందిస్తున్న వైద్యులు

సద్వినియోగం చేసుకోవాలి



ఆయుర్వేద ఆస్పత్రిలో ప్రారంభించిన టెలి మెడిసిన్ సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా దూర ప్రాంతాల్లోని వారు, ఆస్పత్రికి రాలేని స్థితిలో ఉన్నవారు, వృద్ధులకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆస్పత్రిలో అన్ని రోగాలకు చికిత్స అందిస్తున్నాం. టెలి మెడిసిన్ సేవల కోసం వరంగల్ ఆస్పత్రిలోని 0870–2933553 నంబర్‌కు ఫోన్ చేసి వైద్యం పొందొచ్చు

- డాక్టర్ పద్మావతి, సూపరింటెండెంట్

ఆన్‌లైన్ జాబ్ పేరుతో మోసం

● రూ.12 లక్షల వరకు పోగొట్టుకున్న బాధితుడు



సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ

మహబూబాబాద్ రూరల్ : ఆన్‌లైన్ జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్లు విసిరిన వలలో ఓ బాధితుడు చిక్కుకున్నాడు. రూ.12 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన కొద్ది రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ కథనం ప్రకారం.. జిల్లాలోని ఓ మండలానికి చెందిన ఒక వ్యక్తి ఫోన్‌కు యువతి డీపీతో ఉన్న గుర్తు తెలియని నంబర్ నుంచి పార్ట్ టైం జాబ్ పేరుతో మెసేజ్ వచ్చింది. దీనికి బాధితుడు సరే అని రిప్లై ఇవ్వగా నేరగాళ్లు ఓ యూట్యూబ్ వీడియో లింక్ పెట్టి దీనిని లైక్ అండ్ షేర్ చేసి దీనికి సంబంధించిన స్క్రీన్ షాట్ పంపించమని చెప్పగా బాధితుడు అలాగే చేశాడు. ఇలా మూడుసార్లు మూడు టాస్క్‌లు చేయగా ఇందుకు గాను రూ.150కి సంబంధించి విత్ డ్రా కోసం ఒక టెలిగ్రామ్ ప్రొఫైల్ లింక్‌ను పంపించారు. అయితే మీరు ఇంకా కొంత మొత్తాన్ని జమ చేస్తే అన్నీ కలిపి మీకు చివరికి వస్తాయని నేరగాళ్లు.. బాధితుడిని నమ్మించారు. అలా బాధితుడి చేత సుమారు రూ.12 లక్షల వరకు జమచేయించారు. అయితే ఆ డబ్బు విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయానని గమనించిన బాధితుడు.. 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఇదే తరహా టాస్క్ బేస్డ్ ఫ్రాడ్‌లో జిల్లాలోని మరో వ్యక్తి సుమారు రూ.32 లక్షలు పోగొట్టుకున్నాడని ఎస్పీ బుధవారం వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కు కాల్ చేయడం లేదా వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

సాగుకు సమాయత్తం కావాలి

● వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకుడు ఉమారెడ్డి

హన్మకొండ : వానాకాలం సాగుకు రైతుల సమాయత్తం కావాలని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి తెలిపారు. రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో సూచించారు. వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలని, పంట అవశేషాలు కాల్చొద్దని, అవసరం ఉన్న చోట మృత్తిక పరీక్ష చేసుకుని వచ్చిన ఫలితాలను బట్టి క్రమపద్ధతిలో ఎరువులు వాడాలని సూచించారు. స్వల్ప వర్షం పడగానే చాలా మంది రైతులు తొందర పడి విత్తుకుంటారన్నారు. ఇలా చేయొద్దన్నారు. భూమిలో ఉండే అధిక వేడికి విత్తనాలు మొలకెత్తవన్నారు. ఎర్ర చెలక నేలలైతే 70 మిల్లీ మీటర్ల వర్షపాతం, నల్ల రేగడి నేలల్లో అయితే 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైతేనే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ఏ హైబ్రీడ్ విత్తనం ఎంచుకున్నా యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు.

అనుమానాస్పదస్థితిలో అంగన్‌వాడీ టీచర్ మృతి



సుజాత(ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి : అనుమానాస్పద స్థితిలో అంగన్‌వాడీ టీచర్ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని గంగారం– తాడ్వాయి మార్గంలోని నీళ్ల వాగు అటవీ ప్రాంతంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన రడం సుజాత (50) తాడ్వాయి మండలం కాటాపూర్‌లోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పని చేస్తోంది. రోజూ చిన్నబోయినపల్లి నుంచి కాటాపూర్‌కు రాకపోకలు సాగిస్తుంది. ఈనెల 14న అంగన్‌వాడీ కేంద్రం నుంచి మధ్యాహ్నం ఇంటికి బయలుదేరింది. సాయంత్రమైనా రాకపోవడంతో కుటుంబీకులు.. సుజాత కోసం ఆరా తీశారు. ఈ క్రమంలో బుధవారం నీళ్ల వాగు అటవీ ప్రాంతంలో తునికాకు సేకరణకు వెళ్లిన కూలీలకు సుజాత మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు.. సుజాతకు మెడకు స్కార్ఫ్ బిగించి హత్య చేశారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలిని పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. సుజాత.. 25 సంవత్సరాల క్రితం భర్తతో విడాకులు తీసుకుంది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు రడం చరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కాగా, సుజాత మృతి చెందిన విషయం తెలియడంతో కాటాపూర్, గంగారం గ్రామాల నుంచి ప్రజలు ఘటనాస్థలికి భారీగా తరలివచ్చారు. సుజాత మృతదేహాన్ని చూసి కంటతడిపెట్టారు.

రైలు ఢీకొని గ్యాంగ్‌మెన్ దుర్మరణం



మధు (ఫైల్)

రఘునాథపల్లి: రైలు ఢీకొని గ్యాంగ్ మెన్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన రఘునాథపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జనగామ రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని నిడిగొండకు చెందిన గొరిగె మధు (30) రైల్వే గ్యాంగ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలో లైన్ ట్రాక్ చెకింగ్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. దీంతో మధు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య సునీత, ఏడాది వయసు గల కుమారుడు ఉన్నారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి..
కాశిబుగ్గ : రైలు నుంచి పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టే షన్ల మధ్య ధర్మారం రైల్వే గేట్ సమీపంలో జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం మృతుడు 35–40 సంవత్సరాల మధ్య వయసు, 5.5 ఎత్తు, ఎరుపు రంగు నల్లని, తల వెంట్రుకలు గడ్డం మీసాలు కలిగి పొట్టపై బొడ్డు వద్ద పుట్టుమచ్చ ఉందన్నారు. మరేమి వివరాలు లభించక పోవడంతో మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చామని సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే హెచ్‌సీ సుదర్శన్ 97017 47014, 8712658585 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

ధర్మారావుపేటలో చోరీ

● బంగారం, వెండి, సెల్‌ఫోన్లు అపహరణ

ఖానాపురం: మండలంలోని ధర్మారావుపేటలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని రామాలయం, శివాలయం వద్ద హనుమాన్ మాల ధారులు తమ సెల్ ఫోన్‌లు పక్కన పెట్టి నిద్రించారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్లు అపహరించుకెళ్లారు. అనంతరం దుర్గమ్మ దేవాలయంలో చోరీకి పాల్పడ్డారు. ముక్కు పుడక, తాడుతో కూడిన తులం బంగారం, కిరీటం, శఠగోపం, కడియాలు, మెట్టెలు, చైన్లతో కూడిన కేజీ వెండితో పాటు హుండీని ఎత్తుకెళ్లారు. రాత్రి సమయంలో నిద్ర లేచిన హనుమాన్ మాలధారులు తమ సెల్‌ఫోన్లు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.



చోరీ జరిగిన దుర్గమ్మ దేవాలయం

కేయూలో పార్ట్‌టైం లెక్చరర్ల ఆందోళన



కేయూ వీసీ చాంబర్‌లో బైఠాయించిన పార్ట్‌టైం లెక్చరర్లు

కేయూ క్యాంపస్: కాంట్రాక్టు లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూలో పార్ట్‌టైం లెక్చరర్లు బుధవారం ఆందోళనకు దిగారు. మధ్యాహ్న భోజన సమయంలో బయటకు వెళ్లిన వీసీ మళ్లీ పరిపాలన భవనానికి రాలేదు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు వీసీ చాంబర్‌లో ఆందోళన చేసిన వారు అనంతరం రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆందోళనకు దిగి రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కేయూ పార్ట్‌టైం లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పార్ట్‌టైం లెక్చరర్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21న వీసీ పదవీ కాలం ముగిసేలోగా 16 పీరియడ్ల వర్క్‌లోడ్ కలిగిన 130 మందిని కాంట్రాక్టు లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా, ఎన్నికల కోడ్ ఉండగా కాంట్రాక్టు లెక్చరర్లుగా నియమిస్తే తమకు ఇబ్బందులు తప్పవన్నారు. తమను కన్వర్షన్ చేసేందుకు సంతకం చేయకపోతే పదవికి రాజీనామా చేయాలని నాయకులు రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేశారు. కాంట్రాక్టు లెక్చరర్‌గా కన్వర్షన్ చేస్తామని నాలుగు రోజుల క్రితం హామీ ఇచ్చి, ఇప్పుడు చేయలేకపోతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసమని వీసీపై మండిపడ్డారు. ఈ ఆందోళన రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సిబ్బంది వచ్చి రిజిస్ట్రార్, ఆందోళనకారులతో మాట్లాడారు. అర్హుల జాబితాను ప్రభుత్వ ఆమోదం కోసం పంపిస్తామని రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో పార్ట్‌టైం లెక్చరర్లు ఆందోళన విరమించారు.

వివిధ కేసుల్లో నిందితులకు శిక్షల ఖరారు

మహబూబాబాద్ రూరల్ : భార్య మృతికి కారణమైన భర్తకు 15 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మహబూబాబాద్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సి.సురేష్ బుధవారం తీర్పు ఇచ్చారు. రూరల్ సర్కిల్ కోర్టు డ్యూటీ అధికారి నెలకుర్తి అశోక్ రెడ్డి కథనం ప్రకారం.. మహబూబాబాద్ రూరల్ పీఎస్ పరిధి గాంధీపురానికి చెందిన గండమల్ల వీరన్న, సంగీతకు 1999లో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ తగాదాల కారణంగా మనస్పర్థలు ఏర్పడి వీరన్న తన భార్య సంగీతను తరచూ వేధింపులకు గురిచేస్తూ కొట్టేవాడు. దీంతో మనస్తాపానికి గురైన సంగీత 2016 మే 5వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి చెల్లి అనిత ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోషిణి కోర్టులో వాదనలు వినిపించగా ప్రస్తుత రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి అశోక్ రెడ్డి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సురేష్ నేరం నిరూపణకాబడిన వీరన్నకు 15 నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

మిత్రుడి మృతికి కారణమైన కేసులో మరొకరికి 5 ఏళ్ల జైలు..
మహబూబాబాద్ రూరల్ : మిత్రుడి మృతికి కారణమైన ఓ వ్యక్తికి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ బుధవారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి, హెచ్‌సీ దేవా కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాలోని చిన్న గూడూరుకు చెందిన గంట నవీన్‌ను తన మిత్రుడు, మరిపెడ మండలం చిల్లంచర్లకు చెందిన దూడపాక ప్రశాంత్.. 2018 సెప్టెంబర్ 17వ తేదీన కురవి మండలం తట్టుపల్లికి చెందిన తన మేనమామ ఎడెల్లి వెంకన్న ఇంటికి తీసుకెళ్లాడు. అదే రోజు రాత్రి నవీన్, ప్రశాంత్ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సమయంలో ప్రశాంత్ ఆగ్రహంతో నవీన్‌ను నెట్టివేయడంతో కిందపడి తీవ్ర గాయమై మృతిచెందాడు. వెంటనే నవీన్ మృతదేహాన్ని ఆ పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి పడేశాడు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలికి చేరుకుని మృతుడి బంధువులకు సమాచారం తెలిపారు. ఈ ఘటనపై మృతుడి బావ కంచనపల్లి నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటి ఏఎస్సై భిక్షపతి నమోదు చేశారు. అప్పటి మహబూబాబాద్ రూరల్ సీఐ జూపల్లి వెంకటరత్నం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీసర పద్మాకర్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించగా ప్రస్తుత రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై గోపి ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి దేవా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణకాబడిన ప్రశాంత్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బైక్ చోరీ కేసులో ఒకరికి ఏడాది..
మరిపెడ రూరల్: బైక్ చోరీ కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం జిల్లా పాత రామన్నపేటకు చెందిన రెంటల నాగేంద్రబాబుకు తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు మరిపెడ ఎస్సై ఎస్‌కే తహెర్‌బాబా తెలిపారు. 2023లో మరిపెడ మున్సిపాలిటీకి చెందిన షేక్ సలీం ఈద్గా బజార్‌లో గల తన ఇంటి ఎదుట బైక్‌ను పార్క్ చేసి ఇంట్లో నిద్రించాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున లేచి చూడగా బైక్ కనిపించలేదు. ఈ ఘటనపై బాధితుడు మరిపెడ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై డి. పవన్ కేసు నమోదు చేశాడు. కేసు విచారణ అనంతరం కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. గణేష్ ఆనంద్ వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి మట్ట సరిత.. రెంటల నాగేంద్ర బాబుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు..
వరంగల్ లీగల్/చెన్నారావుపేట : అదనపు కట్నం కోసం భార్యను చంపిన చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామ పరిధి లచ్చినాయక్ తండాకు చెందిన మాలోత్ రవికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ వరంగల్ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.ప్రేమలతా బుధవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవారెడ్డి కథనం ప్రకారం.. లచ్చినాయక్ తండాకు చెందిన మాలోత్ రవికి కొత్తగూడ మండలం ఓటాయి తండాకు చెందిన రమతో వివాహం జరిగింది. ఈ దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు. రెండు సంవత్సరాల వరకు వీరి కాపురం సజావుగా సాగింది. మొదటి సంతానంగా కూతురు జన్మించడంతో రవి అదనపు కట్నం కోసం భార్యను వేధించడం ప్రారంభించాడు. ఆడపిల్ల పుట్టినందుకుగాను తనకు డబ్బు ఇవ్వాలని అత్తామామను డిమాండ్ చేయడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఇచ్చారు. రెండు, మూడో సంతానం సమయంలో కూడా రవి గొడవ చేశాడు. తరుచూ డబ్బులు కావాలని భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో 2016 సెప్టెంబర్ 12న రవి తన స్నేహితుడితో కలిసి ఇంట్లో మాంసాహారంతో భోజన చేసే సమయంలో రమ ఇంట్లోకి వచ్చి ఈ రోజు సోమవారం పూజలు చేసుకోవాలి.. మాంసం తినడం ఏమిటని అడిగింది. దీంతో నన్ను ఎదురించి మాట్లాడుతావా అని రవి..రమను చితకబాది బైక్‌పై నర్సంపేటకు వెళ్లాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రమను హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఐదు రోజుల తర్వాత 2016 సెప్టెంబర్ 16న మృతి చెందింది. ఈ విషయం తెలిసిన రవి తన కోసం పోలీసులు గాలిస్తున్నారని భావించి మరుసటి రోజు గ్రామానికి వచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడు రవిని అరెస్టు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు నేరం రుజువుకావడంతో రవికి జీవిత ఖైదు రూ.26,500 జరిమానా విధిస్తూ జడ్జి ప్రేమలతా తీర్పు వెల్లడించారు. కేసు పోలీసు అధికారులు ఏసీపీ బి.కిషన్, సీఐ చంద్రమోహన్, జి.అరుణ్ పరిశోధించగా, లైజన్ ఆఫీసర్ వెంకటస్వామి విచారణ పర్యవేక్షించారు. సాక్షులను కానిస్టేబుల్ టి.సురేందర్, హోంగార్డు ధర్మరాజు కోర్టులో ప్రవేశపెట్టారు.

వేర్వేరు కేసుల్లో ఇరువురికి జైలు శిక్ష..
తొర్రూరు: వేర్వేరు కేసుల్లో ఇరువురికి జైలు శిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ కోర్టు తీర్పునిచ్చింది. ఎస్సై జగదీష్ కథనం ప్రకారం.. మండలంలోని హరిపిరాలకు చెందిన సమ్మెట సూరి.. తాను మావోయిస్టునని చెప్పి స్థానిక బంగారం వ్యాపారి చలువాది సత్యనారాయణను బెదిరించాడు. అతడి వద్ద రూ.లక్ష వసూలు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విన్న జడ్జి మట్ట సరిత.. నిందితుడికి రూ.3 వేల జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మరో కేసులో 2015లో వివాహం చేసుకుంటానని దంతాలపల్లి మండలం దాట్లకు చెందిన నర్కుటి శ్రీను ఓ యువతిని మోసగించాడు. ఈ కేసులో నిందితుడికి రూ.2 వేల జరిమానా విధించడంతో పాటు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. కాగా, నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ఎస్సై జగదీష్, కోర్టు కానిస్టేబుల్ సతీష్‌ను సీఐ సంజీవ, ఏపీపీ గణేష్ ఆనంద్ అభినందించారు.

గాయపరిచిన ముగ్గురికి రెండేళ్ల జైలు..

మహబూబాబాద్ రూరల్ : ముగ్గురు వ్యక్తులపై దాడిచేసి గాయపరిచిన కేసులో ముగ్గురికి రెండేళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.3,400 చొప్పున జరిమానా విధిస్తూ మహబూబాబాద్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సి.సురేష్ బుధవారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి, హెచ్‌సీ బీరం సంపత్ రెడ్డి కథనం ప్రకారం.. మహబూబాబాద్‌లోని భట్టు అంజన్న నగర్ ప్రాంతంలో నివాసం ఉండే దారంగుల సురేష్, రాపోలు వెంకటమ్మ, సంపంగి రమేష్ కోవిడ్ (కరోనా)ను వ్యాప్తి చేస్తున్నారని ఆరోపిస్తూ అదే ప్రాంతానికి చెందిన కూజ ఉపేందర్, సట్ల యాకయ్య, బొమ్మెరబోయిన సంపత్ 2020 డిసెంబర్ 21వ తేదీన దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటనపై దారంగుల సురేష్ మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి టౌన్ ఎస్సై అరుణ్ కుమార్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోషిణి కోర్టులో వాదనలు వినిపించగా ప్రస్తుత టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి సంపత్ రెడ్డి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సి.సురేష్ నేరం నిరూపణకాబడిన ఉపేందర్, సంపత్, యాకయ్యకు రెండేళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.3,400 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.



రాఘవపురాన్ని సందర్శించిన కేంద్ర బృందం



మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పాలకుర్తి: కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు అధికారులు బుధవారం పాలకుర్తి మండలం రాఘవపురాన్ని సందర్శించారు. జాతీయ స్థాయి అవార్డుల ఎంపికలో భాగంగా గ్రామంలో నీటిపారుదల సౌకర్యాలు, నీటి వనరులు, మరుగు దొడ్లు, ఇళ్లలో ఉన్న నీటి గుంతలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై నివేదిక రూపొందించి కేంద్రానికి పంపించనున్నారు. కార్యక్రమంలో సైంటిస్టు బీజన్ కేటన్ మొహంతి, డీఆర్‌డీఏ పీడీ వీరన్న, డీఆర్‌డీఏ కార్యాలయం సీటీఏ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ రాములు, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, ఏపీఓ మంజుల, గ్రామ పంచాయతీ కార్యదర్శి లింగయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పల్లా, ప్రశాంత్‌రెడ్డిపై కేసు

జనగామ: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈనెల 13వ తేదీన జనగామలోని ధర్మకంచ బూత్ వద్ద జరిగిన ఘర్షణ కేసులో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డితో సహా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. ఓటింగ్ సరళిని పర్యవేక్షించేదుకు ప్రశాంత్‌రెడ్డి ధర్మకంచ పోలింగ్ కేంద్రానికి వెళ్లగా బీఆర్‌ఎస్ ఏజెంట్ అడ్డుకోవడంతోపాటు ఎమ్మెల్యేకు సమాచారం అందించారు. దీంతో పార్టీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పల్లా సదరు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. ఈ క్రమంలో ప్రశాంత్‌రెడ్డి ఎదురుపడడంతో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. అక్కడే ఉన్న ఏసీపీ అంకిత్‌కుమార్, సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సైలు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే, ప్రశాంత్‌రెడ్డి, పార్టీ శ్రేణులను బయటకు తీసుకురాగా, కార్యకర్తలు ఇరువైపులా గొడవకు దిగడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఉద్రిక్తత పరిస్థితులకు కారణమైన ఎమ్మెల్యే, ప్రశాంత్‌రెడ్డి, ఇరు పార్టీలకు చెందిన తొమ్మిది మంది చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, దాసరి క్రాంతి, గజ్జెల నర్సిరెడ్డి, మల్లిగారి రాజు, మాజీద్, వీరస్వామి, తిప్పారపు విజయ్, ఉల్లెంగుల సందీప్‌పై ఏఆర్ ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. కాగా, ధర్మకంచ పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యేతో పాటు బీఆర్‌ఎస్ వర్గీయులు కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన వీడియోలు తమ వద్ద ఉన్నాయని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE
■ మడికొండ నుండి ఎల్కుర్తికి BT Road కు నేషనల్ హైవేకు దగ్గర ఉన్న 1.05 ఎకరాల ఓపెన్ ల్యాండ్ కాంపౌండ్ వాల్, 1 రూము ఉన్న ల్యాండ్ స్టాక్ యార్డ్, గోదాములకు, సర్వీస్ సెంటర్‌కు లీజుకు ఇవ్వబడును. సంప్ర॥ 7093873666. [W-1264896]

SERVICES
■ హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి చేయబడును. సెల్: 7842273342, హన్మకొండ. [WA-7521]

FINANCE
■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ ఋణాలు ఏ బ్యాంకులో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1242459]

BUSINESS OFFER
■ WE are READY TO INVEST TO DEVELOP YOUR BUSINESS. we also Welcome Agents. Good Salary & Commission. Cont: 9092692403 [IA-017]

WANTED
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/– మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185077]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K ఫోన్: 9160900024/9640400073 [H-799880]

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ ఆఫీస్ అసిస్టెంట్స్, నర్సులు, లేడీ కేర్ టేకర్స్, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-14041]

WANTED TEACHERS
■ We are recruiting Experienced / Fresher Teachers to teach for the classes KG to 10 (EM) for all subjects and Non-Teaching Staff. Qualification: Good Spoken English and passion for teaching. Interviews @ 18-05-2024 from 9:00 to 5:00 PM Abhyasa the school, Ganesh Nagar, Shambhunipet, Warangal. Cell:" 9989398399, 8885398399 [W-1264970]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.